ప్రజాశక్తి

సోమవారం 9 సెప్టెంబర్ 2024 | 5 | విజయనగరం

జిల్లాలో పరిస్థితులపై మంత్రి ఆరా

అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

విజయనగరంకోట : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో ఫోన్లో మాట్లాడి, జిల్లా పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాపై వర్ష ప్రభావం, అధికార యంత్రాంగం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. నదులు, రిజర్వాయర్లలో నీటిమట్టంపై ఆరాతీశారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎవరూ కాలువ వైపు వెళ్లకుండా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. అధికారం యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. నీటి పారుదలశాఖ ఇఇని కలెక్టరేట్‌లోనే ఉంచి, ఎప్పటికప్పుడు పరిస్థితి పర్యవేక్షిస్తూ తగుచర్యలను తీసుకోవాలని సూచించారు.

ఎడతెరిపిలేని వాన

మడ్డువలస ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తి దిగువకు విడిచిపెట్టిన నీరు

- జిల్లాలో 131.53 సెంటీమీటర్ల వర్షపాతం
- అత్యధికంగా గుర్లలో 11.4 సె.మీ
- పెరిగిన జలాశయ నీటిమట్టాలు
- తాటిపూడి, మడ్డువలస గేట్లు ఎత్తివేత
- పొంగిపొర్లుతున్న నదులు, గెడ్డలు, వాగులు

ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి

రిజర్వాయర్ల నీటి మట్టాలు

రిజర్వాయరు	సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
తాటిపూడి	297 అడుగులు	295 అడుగులు
మడ్డువలస	65 మీటర్లు	64.14 మీటర్లు
వట్టిగెడ్డ	121.62 మీటర్లు	118.17 మీటర్లు
ఆంధ్ర	146 మీటర్లు	142.1 మీటర్లు
వెంగళరాయ	161మీటర్లు	160.32 మీటర్లు
పెద్దగెడ్డ	213.8 మీటర్లు	213.28 మీటర్లు
తోటపల్లి	105 మీటర్లు	103.8 మీటర్లు

మడ్డువలసకు భారీగా వరద

వంగర : మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు 11,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం 64.16 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లు. దీంతో రిజర్వాయరు 8 గేట్లు ఎత్తి, 16,550 సెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నట్లు ఎఇ నితిన్ తెలిపారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తహశీల్దార్ డి.ధర్మరాజు, ఆర్ఐ జావి మురళి, ఎస్ఐ షేక్ శంకర్ నదీ తీర గ్రామాల్లో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇరు జిల్లాల్లోనూ జలాశయాల్లో నీటిమట్టాలు పెరిగాయి. నాగావళి, జంఝావతి, వేగావతి, సువర్ణముఖి, గోముఖి, చంపావతి తదితర నదుల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. జలాశయాల్లో వచ్చిచేరే నీటి ప్రవాహం కూడా పెరిగింది. నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరడంతో తాటిపూడి జలాశయం గేట్లు ఎత్తివేశారు. మడ్డువలస అవుట్‌ఫ్లో నీటిని కూడా పెంచారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో 625.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలో సగటు వర్షపాతం 52.4 మి.మీగా రికార్డు అయింది. జిల్లాలో సగటు మండలంలో ఈనెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు 46.4 మి.మీ వర్షం కురవగా, 8వ తేదీ (ఆదివారం) ఒక్కరోజు 48.7 మి.మీ సగటు వర్షపాతంగా నమోదు కావడం గమనార్హం. ఆదివారం అత్యధికంగా గుర్ల మండలంలో 11.4 మి.మీ వర్షం కురిసింది. నెల్లిమర్లలో 88.2 మి.మీ డెంకాడ మండలంలో 88.1 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా బొబ్బిలిలో కేవలం 6.2 మి.మీ మాత్రమే కురిసింది. ఈ నెలలో ఇప్పటి వరకు రాజాం, మెంటాడ, వేపాడ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగిలిన 24 మండలాల్లోనూ అధిక వర్షపాతం ఉంది. అటు పార్వతీపురం జిల్లాలో 189.8 మి.మీ వర్షం కురిసింది. కురుపాం మండలంలో 25.2 మి.మీ మేర అత్యధికంగా నమోదైంది. అత్యల్పంగా పార్వతీపురం 3.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా జలాశయాల ప్రవాహాలు

తాటిపూడి జలాశయం నీటి సామర్థ్యం 3.325 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 3.05 టిఎంసిల నీరు చేరింది. నీటి ప్రవాహం (ఇన్ ఫ్లో) 695 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 295.50 క్యూసెక్కులు మేర ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు నీటిని విడుదల చేశారు. మడ్డువలస జలాశయం పూర్తి నీటిమట్టం ద్వారా 65 మీటర్లుకాగా, ప్రస్తుతం 64.04 మీటర్ల నీరు ఉంది. ఇన్ ఫ్లో ఎక్కువగా ఉండడంతో కొద్దిరోజుల క్రితమే గేట్లు పరిమితంగా ఎత్తివేశారు. ఆదివారం కురిసిన వర్షాలకు నీటి ఔట్ ఫ్లోను కూడా పెంచారు. ప్రస్తుతం 11,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 16,400 క్యూసెక్కుల మేర విడిచిపెడుతున్నారు. వట్టిగెడ్డ పూర్తిసామర్థ్యం 0.958 టిఎంసి కాగా, ప్రస్తుతం 0.537 టిఎంసిలు ఉంది. ప్రస్తుతం 151 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 115 క్యూసెక్కులుగా ఉంది.

తోటపల్లి సామర్థ్యం 2.534 టిఎంసిలు. ప్రస్తుతం 1.785 టిఎంసిల నీరు నిల్వ ఉంది. 2,160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1851 క్యూసెక్కుల నీరు ఔట్ ఫ్లో కనిపిస్తోంది. ఆంధ్ర జలాశయం పూర్తి సామర్థ్యం 0.98 టిఎంసి కాగా, ప్రస్తుతం 0.479 టిఎంసిల నీరు ఉంది. 285 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో కనిపిస్తుండగా, ప్రస్తుతం ఔట్‌ఫ్లో లేదు. వెంగళరాయసాగర్ పూర్తి సామర్థ్యం 1.683 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.455 టిఎంసిల నీరు ఉంది. ప్రస్తుతం 817 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా, ఔట్ ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది. ఇందులో 100 క్యూసెక్కులు నీరు గోముఖినదిలోకి, మరో 100 క్యూసెక్కులు సువర్ణముఖి నదిలోకి వదులుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. పెద్దగెడ్డ పూర్తి కెపాసిటీ 0.949 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.899 టిఎంసిలు నీరు ఉంది. ఇన్‌ఫ్లో 324 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 300 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. జంఝావతిలోకి 492.67 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండగా, 492 క్యూసెక్కుల మేర అధికారులు బయటకు వదిలారు. నారాయణపురం ఆనకట్ట సామర్థ్యం 30.77 మీటర్లకు గాను 29.6 మీటర్ల వరకు నీటిమట్టం ఉంది. ఆంధ్ర జలాశయంలో 267 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండగా, 62 క్యూసెక్కుల నీరు బయటకు పోతోంది.

మండలం	కురిసిన వర్షం మి.మీ
వంగర	22
రేగిడి	29.9
సంతకవిటి	59.2
రాజాం	26.2
బొబ్బిలి	06.2
రామభద్రపురం	15.4
బాడంగి	14.7
తెర్లాం	27.7
మెరకముడిదాం	36.6
దత్తిరాజేరు	35.3
మెంటాడ	13.3
గజపతినగరం	61.3
గరివిడి	69.8
చీపురుపల్లి	55.4
గుర్ల	114.8
బొండపల్లి	65.7
గంట్యాడ	73.6
ఎస్.కోట	26.8
వేపాడ	23.2
ఎల్.కోట	31.8
కొత్తవలస	26.7
జామి	72.0
విజయనగరం	81.2
నెల్లిమర్ల	88.2
పూసపాటిరేగ	68.4
డెంకాడ	88.1
భోగాపురం	81.8
మొత్తం	1315.3

మోకాళ్లలోతు నీటిలో రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు

జలదిగ్బంధంలో రేగిడి

రేగిడి : ఎడతెరిపి లేని వర్షాలతో ఆకులలోవ కట్టగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో లోతట్టులో ఉన్న రేగిడి గ్రామం చుట్టూ శనివారం రాత్రి వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ, పశు వైద్య కేంద్రాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు జల దిబ్బంధంలో ఉన్నాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. గెడ్డ ఉధృతికి వంతెన మీదుగా వరద నీరు ప్రవహిస్తోంది. ఆర్.ఆమదాలవలస, రేగిడి, తునివాడ, వెంకంపేట, చెలికానివలస, చిన్నయ్యపేట గ్రామాల్లో వరి, చెరకు పంటలు నీట మునిగాయి. సోమవారం కూడా భారీవర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు, గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

– తోటపల్లి, మడ్డవలస జలాశయాల నుంచి నీరు విడుదల చేయడంతో నాగావళి నది పొంగి ప్రవహిస్తోంది. నీటి ఉధతిని తహశీల్దార్ ఎల్లారావు పరిశీలించారు. బొడ్డవలస వద్ద వరద గట్టు లేకపోవడంతో వరద నీరు గ్రామాల్లోకి వెళ్ళింది. నదీతీర గ్రామాలైన బొడ్డవలస, కొమెరి, వెంకటాపురం, రేగిడి, చిలికానివలస, తునివాడ ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

రామకృష్ణానగర్‌లో కూలిన ఇల్లు

కూలిన రేకు ఇల్లు

విజయనగరం టౌన్ : గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నగరంలోని రామకృష్ణా నగర్‌లో రేకుఇల్లు ఆదివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న కుటుంబ సభ్యులపై కూలి పోయింది. కుటుంబ పెద్ద బలగ లింగమూర్తి నడుముపై రాట పడటంతో ఆయన నడుము విరిగింది. వెంటనే జిల్లా ఆసు పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కెజిహెచ్‌కి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఆందోళనగా ఉంది. ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, కాలనీ కార్యదర్శి ఎం.శాంతమూర్తి కోరారు.

నగరంలో భారీ వర్షం

లోయర్‌ట్యాంకు బండ్ రోడ్డుపై చేరిన నీరు

విజయనగరం టౌన్ : నగరంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. పెద్ద చెరువులో భారీగా నీరు చేరడంతో దిగువ భాగంలో గండి కొట్టి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. లోయర్ ట్యాంకు బండ్ రోడ్డు చెరువులా తయారైంది. ఆదివారం రోజంతా వర్షం కురుస్తూనే ఉండటంతో గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి రోడ్డులో షాపులు తెరుచుకోలేదు.

8 పునరావాస కేంద్రాలు ఏర్పాటు

నగరంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ సమర్థవంతంగా నిర్వహించేందుకు కమిషనర్ పి.నల్లనయ్య చర్యలు చేపట్టారు. విజయవాడలో పారిశుధ్య విధానాన్ని మెరుగుపరిచేందుకు అక్కడ నిరంతరాయంగా కమిషనర్ పి.నల్లనయ్య సేవలు అందిస్తున్నా, నగరంలో వర్ష పరిస్థితి వల్ల తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగు సూచనలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులపాటు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. 24 గంటలు పనిచేసే విధంగా కాల్ సెంటర్ ను ఇదివరకే ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందుకోసం సమస్య తలెత్తిన వెంటనే లోతట్టు ప్రాంతాల వారికి సురక్షిత ప్రాంతాల తరలించేందుకు 8 చోట్ల పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. ఎక్కడైనా ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే కాల్ సెంటర్ నెంబర్ 98499 06486ను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

ట్యాంక్ బండ్ రోడ్డులో పెద్దచెరువు నీటి ప్రవాహాన్ని మున్సిపల్ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పరిశీలించారు. ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, డిఇ అప్పారావుతో కలిసి అక్కడికి చేరుకున్న ఆయన అక్కడ నెలకొన్న పరిస్థితిపై సమీక్షించారు. పల్లపు ప్రాంతానికి ప్రవహించే కాలువలో అడ్డంకులను తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

- గ్రీవెన్స్ రద్దు

విజయనగరంటౌన్, కోట : భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటం, సోమవారం కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా వినతుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అధికారులతో మాట్లాడిన ఎంపి

విజయనగరం కోట : ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విజయనగరం , శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో, ఎస్‌పిలతో, మండల అధికారులతో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఫోన్‌లో మాట్లాడారు. అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. రెండు జిల్లాలపై వర్ష ప్రభావం, అధికార యంత్రాంగం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలని సూచించారు.

నిలిచిన బస్సు సర్వీసులు

విజయనగరం కోట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆదివారం 25 బస్సు సర్వీసులు రద్దు చేసినట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరం డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు.. ఇలా 25 బస్సులు నిలిపేసినట్లు చెప్పారు.

పోలీసు గ్రీవెన్స్ రద్దు

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉన్నాం

- పరిస్థితి అదుపులోనే ఉంది : కలెక్టర్
- తాటిపూడి రిజర్వాయర్ పరిశీలన
- విజయనగరంలో విస్తృత పర్యటన

పెద్దచెరువు నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట, గంట్యాడ

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయన ఆదివారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా తాటిపూడి రిజర్వాయర్‌ను కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ గరిష్ట సామర్థ్యం 297 అడుగులు కాగా, ఇప్పటికే 295 అడుగులకు చేరుకుంది. దీంతో అప్రమత్తంగా ఉండి, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్‌ఫ్లో పెరిగి, మరో అర అడుగు నీటిమట్టం పెరిగితే, గేట్లు ఎత్తివేస్తామని నీటిపారుదల అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఇప్పటికే రిజర్వాయర్ దిగువ ప్రాంతాలైన శృంగవరపుకోట, జామి, గంట్యాడ మండలాల తహశీల్దార్లకు సమాచారాన్ని అందించామని వివరించారు. పర్యటనలో తాటిపూడి ఇఇ సీతారామనాయుడు, జెఇ తమ్మినాయుడు, గంట్యాడ తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో పర్యటన.. జోరువానలో కలెక్టర్ అంబేద్కర్ విజయనగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా పెద్దచెరువు గట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎల్‌ఐసి భవనం సమీపంలోని కల్వర్టును, రోడ్లపై పొంగుతున్న పెద్దచెరువు నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. నీరు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైతే కల్వర్టు వద్ద ఆటంకాలను తొలగించాలని ఆదేశించారు. పద్మావతి నగర్ వద్ద పొంగి ప్రవహిస్తున్న కాలువను పరిశీలించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, తహశీల్దార్ కూర్మనాథరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వదంతులు నమ్మొద్దు : కలెక్టర్

భారీ వర్షాలపై సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలు, వదంతులను నమ్మవద్దని కలెక్టర్ సూచించారు. పెద్దచెరువు గట్టుకు గండి పడలేదని స్పష్టం చేశారు. జిల్లాలో పరిస్థితి అదుపులోనే ఉందని, ఎక్కడా పెద్దగా ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. మూడు మండలాలు మినహా, మిగిలిన చోట్ల పెద్దగా వర్షాలు కురవలేదని చెప్పారు. వంతెనలు, కాజ్‌వేలు దాటే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వాటిపై నుంచి దాటవద్దని సూచించారు. మత్స్యకారులకు కూడా తగిన హెచ్చరికలను జారీ చేశామని కలెక్టర్ వివరించారు.

యువత ఉన్నతే లక్ష్యం

- 13న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు
- 'ప్రజాశక్తి'తో సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంకోట

'యువత ఉన్నతే లక్ష్యంగా యువజన సర్వీసుల శాఖ ముందుకెళ్తుంది. 18 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువతీ యువతను ఎంపికచేసి, ఆయా రంగాల్లో వారిని అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి. అందుకోసం వివిధ శాఖల సమన్వయంతో ముందుకెళ్తున్నా'మని సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ తెలిపారు. జిల్లాలో యువతను ప్రోత్సహిస్తూ సంఘాలను ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలో ఎన్ని యువజన సంఘాలు ఉన్నాయి? వాటి విధివిధానాలు ఏమిటి.?

జిల్లాలో ప్రస్తుతం 99 యువజన సంఘాలు ఉన్నాయి. మరికొన్ని ప్రతిపాదనల్లో ఉన్నాయి. యువజన సంఘాలు గ్రామ స్థాయిలో కార్యక్రమాలు చేపడతాయి. సమాజాభివృద్ధికి అవసరమైన సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి.

యువత నైపుణ్య అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

యువత నైపుణ్య అభివృద్ధికి జిల్లాలో ఉన్న వివిధ శాఖల సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. డిఆర్‌డిఎ, ఉపాధి కల్పన, పరిశ్రమల శాఖ, వ్యవసాయ, మత్స్యశాఖలతోపాటు వ్యవసాయ అనుబంధ సంఘాల ద్వారా కూడా శిక్షణ ఇచ్చి వారికి అవకాశాలు కల్పిస్తున్నాం.

యువజన ఉత్సవాలు ఎప్పుడు, ఏయే అంశాల్లో నిర్వహిస్తున్నారు.?

యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వారి అభివృద్ధికి తోడ్పడటమే యువజన ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఇందులో ప్రధానంగా 18 నుంచి 29 ఏళ్ల వయసున్న యువతీ యువకులను ఎంపిక చేస్తున్నాం. యువజన ఉత్సవాల్లో సాంస్కృతిక విభాగాల్లో జానపద నృత్యాలు, గీతాలు ఉంటాయి. జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్ ప్రకటనలు ఉంటాయి. హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తాం. మొత్తం ఇలా 12 విభాగాల్లో ప్రస్తుతం యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. జిల్లా స్థాయిలో ఎంఆర్ కళాశాలలో ఈ నెల 13న యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

వ్యక్తిత్వ వికాసంపై తరగతులు ఎలా సాగుతున్నాయి.?

9, 10 తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు, సైకాలజీ విభాగం లెక్చరర్లు, వైద్యులు, ఎస్ఐలు.. ఇలా వివిధ విభాగాల్లో నిష్ణాతులైన వ్యక్తులతో తరగతులు నిర్వహిస్తున్నాం. డిగ్రీ, టెక్నాలజీ రంగాల్లో చదువుతున్న వారికి కెరీర్ గైడెన్స్‌పై జిల్లాలో ఉన్న వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నాం.

యువజన ఉత్సవాల నిర్వహణకు నిధులు ఎలా.?

యువజన ఉత్సవాల నిర్వహణకు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తుంది. గతంలో 2022వ సంవత్సరంలో రెండు లక్షల రూపాయలు ఇచ్చారు. 2023లో రూ.50 వేలకు కుదించారు. దానిని ఇప్పుడు మరలా రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలకు పెంచింది. ఈ నిధులతోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.



డిసిసి అధ్యక్షులుగా విద్యాసాగర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం డిసిసి అధ్యక్షులుగా మరిపి విద్యాసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణు గోపాల్ ఉత్తర్వులు జారీచేశారు. బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన మరిపి విద్యాసాగర్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో నిలిచిన విషయం తెలిసిందే.

జిఒ 143ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

జిఒ 143ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.భానుమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎపి తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం, ఎపి ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా ఉమ్మడి సర్వసభ్య సమావేశాన్ని రెవెన్యూ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ ఫీల్డ్‌స్టాఫ్‌కు ముఖ ఆధారిత హాజరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఎఎన్ఎంలను వైద్య ఆరోగ్య శాఖలో కలపాలన్నారు. ప్రతి నలుగురు ఎఎన్ఎంలకు ఒక హెల్త్ సూపర్వైజర్ ఉండాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసాచార్యులు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఎపి ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులుగా టి.బి.ఎస్.వర్మరాజు, మన్యం జిల్లా అధ్యక్షులుగా నారాయణరావు ఎన్నికయ్యారు.

10 మంది ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పది మంది ఎస్ఐలను బదిలీలు చేస్తూ ఎస్‌పి వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీచేశారు. వారి వివరాలు...

నవీన్ పడాల్	లక్కవరపుకోట
వై.వి.జనార్ధన్	జామి
బి.దేవి	వల్లంపూడి
ఆర్.గోపాల్‌రావు	సంతకవిటి
కె.సీతారాములు	ఆంధ్ర
పి.నీలావతి	రేగిడి
లోకేష్ కుమార్	బుదరాయవలస
బి.గణేష్	నెల్లిమర్ల
వి.అశోక్	విజయనగరంరూరల్
ఐ.దుర్గాప్రసాద్	పూసపాటిరేగ

10న క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో ఈ నెల 10న అండర్ –14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి పి.సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2010 సెప్టెంబర్ ఒకటో తేది తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువపత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్, మూడేళ్ల మార్కుల జాబితా తీసుకొని రావాలని సూచించారు. 10న ఉదయం 7 గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్టుతో క్రీడాకారులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మదర్ థెరిసా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఏడో వార్షికోత్సవం సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఆదివారం అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న మదర్ థెరిసా కిడ్స్ స్కూల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిబిఐ విశాఖపట్నం ఎస్‌పి మురళి రంబ మాట్లాడుతూ ప్రస్తుతం మొబైళ్లు, కంప్యూటర్లకు విద్యార్థులు అంకితమై, సబ్జెక్టుకు బదులు అనవసర విషయాలు చూస్తూ పక్కదారి పడుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ పేపర్ చదవడం, న్యూస్ వినడం వంటివి చేస్తే సమాజం గురించి ఆలోచించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాసరావు రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ ఎ.ఎస్ ప్రకాశ రావు, సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం పాల్గొన్నారు.

10న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఈ నెల 10న ఫైజర్ ఫార్మా హెల్త్ కేర్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఉదయ శంకర్ , ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కృష్ణంరాజు తెలిపారు. 2023, 2024లో డి-ఫార్మసీ పూర్తిచేసిన అభ్యర్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు.

ముంచెత్తిన వాన

- రెండు రోజులుగా తెరిపివ్వని వర్షాలు
- కోతకు గురవుతున్న చెరువులు, కాలువ గట్లు, రోడ్లు
- తోండ్రంగి వద్ద నీటి మధ్యలో నిలిచిపోయిన బస్సు
- ఎస్ఎస్ఆర్ పేటను ఖాళీ చేయాలని అధికారుల ఆదేశాలు
- అంధకారంలో నెల్లిమర్ల నగర పంచాయతీ

బొబ్బిలి: రోడ్డుకు పడిన గండిని పూడ్చుతున్న అధికారులు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో వరదనీరు పొంగిపొర్లుతోంది. వరదనీరు ఉప్పొంగడంతో చెరువు గట్లు, సాగునీటి కాలువల గట్లు, రోడ్లు కోతకు గురవుతున్నాయి. అధిక వర్షాలకు ఎం.వనువలస తోపాలవాని చెరువు గట్టు కోతకు గురవడంతో రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి వరదనీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారాది అనకట్టు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో కొత్తపెంట వద్ద కాలువ గట్టు కోతకు గురై పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వరి, అరటి పంటలు నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన కాలువ గట్టును, నీటిలో మునిగిన పంట పొలాలను తహశీల్దార్ ఎం.శ్రీను తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. బొబ్బిలి-పెంట రోడ్డు కోతకు గురికావడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలకు పంటలు, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తహశీల్దార్ ఎం.శ్రీను చెప్పారు.

కోతకు గురైన రోడ్డు

మెరక ముడిదాం: మండలంలోని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన బంటుపల్లి నుంచి చిన రావ్వాం గ్రామానికి వెళ్లే తారు రోడ్డు కోతకు గురైంది. చిన బంటుపల్లి నుంచి చిన రావ్వాం గ్రామ మార్గ మధ్యంలో సర్వాగి మైనింగ్ (గని బంట) వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. పైగా అదే స్థల వద్ద మలుపు ఉండడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బైరిపురం నుంచి లింగాల వలసకు వెళ్లే దారిలో ఉన్న గొడ్డుతామర చెరువు కింద ఉన్న సుమారు 30 ఎకరాల వరి పంట నీట మునిగింది. మండలంలో ఆదివారం నాటికి 3 సెంటీమీటర్లు వర్ష పాతం నమోదైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

వీరసాగరం చెరువుగట్టును పరిశీలించిన ఆర్‌డిఒ

కొత్తవలస: మండల కేంద్రానికి చెందిన వీరసాగరం చెరువు గట్టును ఆర్‌డిఒ ఎం.వి. సూర్యకళ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆమెతో పాటు మండల తహశీల్దార్ బి. నీలకంఠరావు, డిప్యూటీ తహశీల్దార్ రమేష్, ఇఒపిఆర్‌డి ధర్మారావు, ఇరిగేషన్ శాఖ జె.ఇ హేమకుమార్, మండల రెవెన్యూ పరిశీలకులు రాజేష్ పాల్గొన్నారు.

కొత్తవలస: అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సూర్యకళ

డెంకాడ: మండలంలో రెండు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కాలువల చెరువుల పొంగిపొర్లుతున్నాయి. నియోజవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు, మాజీ ఎంపిపి కందిచంద్రశేఖర రావు మండలంలో అన్ని గ్రామాలు సందర్శించి ఎవరికీ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందా అని ఆరా తీశారు. మోదవలస గ్రామంలో చెరువుకు వెళ్లే కాలువకు గండి పడింది. గొడ్డుపాలెం పాలెగెడ్డ రిజర్వాయర్ నిండి బయటకు పొంగిపొర్లుతుంది. దీంతో గెడ్డ సమీపంలో ఉన్న గొడ్డుపాలెం యాతపేట ముంపునకు గురవుతుంది. ఈ యాతపేటను నాయకుల పరిశీలించారు.

పత్తాలేని రెవెన్యూ అధికారులు

ఒకవైపు భారీ వర్షాలు ఉన్నాయని ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రజలను అప్రమత్తం చేశారు. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం ఎక్కడ కనిపించలేదు. తహశీల్దార్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులు పదే పదే చెప్పినా ఇక్కడ రెవెన్యూ అధికారులు మాత్రం పెడచెవిన పెట్టేశారు. సెలవు దినం కావడంతో కార్యాలయంలో ఎవరు కనిపించలేదు. గతంలో తుపాను గురించి కార్యాలయంలో ప్రజలకు రాత్రి పగలు అందుబాటులో ఉండేవారు కానీ ఇప్పుడు పై నుంచి కింది వరకు ఎవరు అందుబాటులో లేరు. మండలంలో పర్యటించిన టిడిపి నాయకులతో ఒకరిద్దరు రెవెన్యూ అధికారులు ఒకటి రెండు గ్రామాలు వెళ్లి అక్కడ పరిస్థితులు చూసి ఎవరి ఇంటికి వారు జారుకున్నారు.

ఎమ్మెల్యే పరిశీలన

భోగాపురం, డెంకాడ: నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మండలంలో నాతవలస పొలంలో నుంచి గ్రామంలోనికి వస్తున్న వరద నీటిని పరిశీలించారు. నేషనల్ హైవే రోడ్డు కాలువ నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె తెలిపారు. గొడ్డుపాలెం రిజర్వాయర్‌ను గ్రామంలో ముంపునకు గురవుతున్న యాతపేటను ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, తహశీల్దార్ వి.పద్మావతి, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం ఆర్‌ఐ ఉన్నారు. భోగాపురం మండలంలో కూడా ఎమ్మెల్యే పర్యటించారు. ముక్కాం గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు ముంపు ప్రాంతాన్ని పరిశీలించి మత్స్యకారులకు తగు జాగ్రత్తలుపై సూచించారు. ఎవరూ వేటకు వెళ్లకుండా ఇళ్ల వద్దే ఉండాలని చెప్పారు.

డెంకాడ: ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

అప్రమత్తమైన అధికారులు

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో మండలంలోని అధికారులు అప్రమత్తమ య్యారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలను తీర గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు. అల్పపీడనం తీవ్ర ప్రభావం చూపుతుండటంతో రానున్న 24 గంటల్లో భారీ వర్షం నమోదయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే మాధవి అధికారులను అప్రమత్తం చేశారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, గ్రామస్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖలు, తీసుకున్న జాగ్రత్త చర్యలపై ఎమ్మెల్యే టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండల నోడల్ అధికారులు ఈ మూడు రోజులపాటు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేసారని, కంట్రోల్ రూములకి ఫోన్ చేయాలని చెప్పారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటి పారుదల, వైద్యారోగ్యశాఖ, విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఉద్యాన, గృహ నిర్మాణ శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో మందులు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాలని, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ మూడు రోజులూ, గ్రామాల్లోనే ఉండాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. విద్యుత్ స్తంబాలు నేలకూలడం, వైర్లు తెగిపడటం కారణంగా ఎక్కడా ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎపి ఈపిడిసిఎల్ అధికారులకు సూచించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు.

గుర్ల : భారీ వర్షంతో ఆదివారం విజయనగరం నుంచి గరివిడి మండలం తోడ్రంకి వెళ్లే పల్లివెలుగు బస్సు జమ్మూపేట రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర నీట మునిగింది. సుమారు 4 అడుగులు నీరు వుండడంతో బస్సు ఎలూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆర్‌టిసి సిబ్బంది, స్థానికులు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు సమాచారం అందించారు. తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాక్టర్ సహాయంతో బస్సును బయటకు తీయించారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఉన్న నీరును బయటకు తొడించాలని రైల్వే కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు తహశీల్దార్ తెలిపారు.

ఇళ్లు ఖాళీ చేయండి

చంపావతి నది ఒడ్డున ఉన్న ఎస్ఎస్ఆర్‌పేట ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తహశీల్దార్ ఆదేశించారు. మండలంలో ఏకైక సాగునీటి ప్రాజెక్ట్ గడిగెడ్డ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో సరిప్లస్ వాలు నుండి4 అంగుళాల ఎత్తులో నీరు బయటకు ప్రవహిస్తుంది. మండలంలో అత్యధికంగా 11. 9 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న పునుపు చెరువు పూర్తిస్థాయిని మించి నిండడం వల్ల చెరువు పై భాగం లోవున్న 39 ఎకరాల వరి పంట మొత్తం నీట మునిగింది. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి తిరుపతి రావు ఘటన స్థలానికి చేరుకొని వరి నాట్లును పరిశీలించారు.

కలెక్టర్ పరిశీలన

భారీ వర్షాలు కురుస్తుండ డంతో చంపావతి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికా రులను ఆదేశించారు. ఆదివారం ఆయన చంపావతి నది ప్రవాహాన్ని ఆనందపురం కాజేవే పై నుంచి ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దార్ ఆదిలక్ష్మిలతో కలసి పరిశీలించారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలన్నారు. నది లోను వాగుల లోను ఎవ్వరు దిగవద్దన్నారు. వరదలు ఎక్కువగా వస్తే అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

గుర్ల: అధికారులను అప్రమత్తం చేస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

అంధకారంలో నగర పంచాయతీ

నెల్లిమర్ల: అంధకారంలో నగర పంచాయతీ కొట్టు మిట్టాడుతుంది. ఆదివారం తెల్ల వారు జామున వర్షాలు కురవడంతో నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాలకు విద్యుత్ నిలిచిపోయి స్థానికులు అవస్థలు పడ్డారు. తుపాను కారణంగా శనివారం రాత్రి నుంచి విద్యుత్ నిలిచిపోవడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి 33 కెవి లైన్ మరమ్మత్తులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది ఇంతవరకు మరమ్మతు పనులు పూర్తి చేయక పోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క వర్షం మరో పక్క విద్యుత్తు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వేలాది రూపాయలు బిల్లులు వసూలు చేస్తున్న ప్రభుత్వం వినియోగదారుడికి సేవలు అందించడంలో విఫలమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

చెరువును సందర్శించిన ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: తుపాను కారణంగా రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదివారం పట్టణంలోని రాజుల చెరువు, కంచేటి కోనేరు చెరువులను పరిశీలించారు. అధికారులు, నాయకులు ఎప్పటికప్పుడు చెరువులను పర్యవేక్షి స్తుండాలని ఆదేశించారు ఈ పరిశీలనలో తహశీల్దార్ అరుణకుమారి, టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు, నాయకులు కాపుగంటి వాసు, చక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాలు, అధ్యక్షులు గనివాడ బంగారు నాయుడు, పెదగాడ రాజు, బ్రాహ్మజీ, హైటెక్ సురేష్, భీశెట్టి మోహన్, పాల్గొన్నారు.

ఎస్‌కోట: చెరువును పరిశీలిస్తున ఎమ్మెల్యే కోళ్ల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెల్లిమర్ల: తుపాను కారణంగా అందరు అప్రమత్తంగా ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ టివిఎస్ విశ్వేశ్వర రావు సూచించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరూ బయటకు తిరగకుండా ఉండాలని, శిథిలావస్థ స్థాయి ఇళ్ళలో ఎవరు ఉండకూడదని సూచించారు. సచివాలయ, నగర పంచాయతీ కార్యాలయం పరిధిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు.

నేలకొరిగిన వరి

వంగర : అల్పపీడనం ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని కోనంగిపాడులో సుమారు 15 ఎకరాల్లో వరి చేను నేలకొరిగింది. రైతులు బౌరోతు సాంబశివరావు, ఇనమల పోలినాయుడు, గొర్లె సింహాచలం, భౌరోతు సత్యనారాయణలకు చెందిన వరి చేను నేలమట్టమైంది. ఎన్నో అప్పులు చేసి మధులు పెట్టి కష్టించి పండిస్తున్న వరి గాలి వర్షానికి నేలకొరగడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



వంగర: కోనంగి పాడులో నేలకొరిగిన వరి పంట

సిఎం సహాయ నిధికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఐవి రాజేశ్వరరావు రూ. లక్ష విరాళంగా అందజేశారు. విజయవాడను వరదలు ముంచెత్తడంతో వరద బాధితులను ఆదుకునేందుకు విరాళం ఇచ్చినట్లు రాజేశ్వరరావు చెప్పారు. చెక్కును ఎమ్మెల్యే బేబినాయనకు ఆదివారం కోటలో అందజేశారు. రాజేశ్వరరావును బేబినాయన అభినందించారు.

రూ.52వేలు విరాళం

విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు బాడంగి మండలం పి.వెంకంపేట యువత రూ.52వేలు సిఎం సహాయ నిధికి అందజేశారు. చెక్కును ఆదివారం కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. యువతను బేబినాయన అభినందించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

మత్స్యకార గ్రామాలలో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- పూసపాటిరేగ

భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని తీర గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. గర్భిణులు, చిన్నారులకు ఇబ్బందులు లేకుండా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి ముందస్తు ప్రణాళికతో తీర ప్రాంత గ్రామాలైన తిప్పలవలస, కోనాడ, నడిపల్లికు చెందిన ముగ్గురు గుర్భిణులు కారి సత్య, కామేశ్వరి, ఆదిలక్ష్మిలను పిహెచ్‌సికి తరలించి సురక్షిత ప్రసవాలు జరిగేలా చేశారు. జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశాల మేరకు ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వర్మ ఆధ్వర్యంలో సముద్ర తీరప్రాంత గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందుల పంపిణీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు సూక్ష్మ ప్రణాళికను సిద్ధం చేసి, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వైద్యులు వర్మ తెలిపారు. అన్ని వెల్నెస్ కేంద్రాల్లో మందులు నిల్వలు సమకూర్చుకొనేలా వైద్య సిబ్బందిని సన్నద్ధం చేసినట్లు వెల్లడించారు.

రోగులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

రేషన్ డీలర్ల నూతన కమిటీ ఎన్నిక

రామభద్రపురం: మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షులు చొక్కాపు రామారావు అధ్యక్షతన స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అన్ని గ్రామాల డీలర్లు ఏకతాటిపై నిలచి ఏకగ్రీవంగా అద్యక్షులుగా నడిపిల్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా మాసాబత్తుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా కిల్లాడ రామకృష్ణ, అదనపు కార్యదర్శిగా పిల్లా రామారావు, గౌరవ అధ్యక్షులుగా గంట నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ డీలర్ల అపరిష్కృ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం రేషన్ పాత విధానంలోనే కొనసాగించేందుకు సానుకూలంగా ఉండడంతో ఆదిశగా ఆ విదానాన్ని సాధించుకునేందుకు మూకుమ్మడిగా కృషి చెయ్యాలని కోరారు. అనంతరం ఇటీవల జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రామారావును మండల నూతన కమిటీ సభ్యులు సత్కరించారు.

రాజుల చెరువు ఆక్రమణల గుర్తింపు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక రాజుల చెరువు దిగువ సాగు భూముల రైతులు చెరువు ఆక్రమణకు గురి అవుతుందంటూ జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆదివారం డిఆర్ఒ కార్యాలయం నుంచి జిల్లా సర్వేయరు సిబ్బందితో సహా వచ్చి సర్వే చేపట్టారు. సదరు రాజుల చెరువు సర్వే నెంబర్ 462గా నిర్ధారణ చేసి 28.87 ఎకరాలు పోరంబోకుగా గుర్తించారు. యఫ్‌యమ్‌బి స్కెచ్ ప్రకారం ఆటోకాడ్‌లో ప్లాట్ చేసి రోవర్ సహాయంతో భూమి పై అందరి సమక్షంలో చెరువు హద్దులు పెగ్సతో మార్కింగ్ చేసి చూపించారు. సర్వే నెంబర్ 461/1, 2, 3లలోని కొంత భాగంలో చెరువు నుంచి నీరు పోవడానికి చప్టాలు ఉన్నట్లు గుర్తించారు. వివాదం కొలిక్కి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల స్థలం అమ్మకంపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సిబిఎం బాలికోన్నత పాఠశాల స్థలం అమ్మకంపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్. గోపాలం, సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. సిబిఎం పాఠశాలను వామపక్ష నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే సిబిఎం పాఠశాల స్థలాన్ని చట్టవిరుద్ధంగా అమ్మి వేయడం దుర్మార్గమన్నారు. పాఠశాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ, విద్యా శాఖాధికారులు సహకరించారన్నారు. తక్షణమే ప్రభుత్వం కలుగజేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి పాఠశాలలోనే తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పేద విద్యార్థులు కోసమే స్థల మార్పిడి

పేద విద్యార్థులు కోసమే సిబిఎం బాలికోన్నత పాఠశాల స్థలానికి బదులు కోమటిపల్లి వద్ద ఉన్న మూడున్నర ఎకరాల స్థలంలో ఉన్న భవనాన్ని ఇచ్చినట్లు లోకబంధు విద్యా సంస్థల అధినేత తూముల భాస్కరరావు తెలిపారు. 2023లో సిబి పాఠశాల రెన్యువల్ సమయం ముగిసిందని, అప్పటి నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయలకు విద్యా శాఖాధికారులు నోటీసులు జారీ చేసినప్పటికి కరస్పాండెంట్‌కు చెప్పకుండా హెచ్ఎం గోప్యంగా ఉంచి విద్యార్థులు భవిష్యత్తుతో ఆడుకున్నారని ఆరోపించారు. మౌలిక సౌకర్యాలు ఉంటేనే పాఠశాలకు రెన్యూవల్ చేస్తామని విద్యాశాఖాధికారులు చెప్పడంతో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు కోమటిపల్లి వద్ద ఉన్న మూడున్నర ఎకరాల స్థలం, భవనాన్ని సిబిఎం పాఠశాలకు ఇచ్చి స్థల మార్పిడి చేసుకున్నామని చెప్పారు.

చదువుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- బొబ్బిలి

చదువుతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ప్రతి బాలిక తప్పనిసరిగా విద్యావంతురాలు కావాలని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జెసి రాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నేపథ్యంలో ఆదివారం స్థానిక కళాశాల బాలికల వసతి గృహంలో అక్షరాస్యత-విద్య-ప్రాముఖ్యత పై కారుణ్య సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ విద్య మాత్రమే వ్యక్తిని ఉన్నతమైన స్థితిలో ఉంచుతుందన్నారు. విద్యతో పాటు జీవిత విలువలు కలిగి ఉండాలన్నారు. బాలిక, మహిళలు విద్యావంతులైనప్పుడే కుటుంబ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. రోటరీ ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి మాట్లాడుతూ పట్టుదల, అవగాహనతో విద్యానభ్యసించాలన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ విద్యాలేనివాడు వింత పశువనే నానుడి ఉందని ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా బాలికలు చదువుకు ప్రాముఖ్యత నివ్వాలని అన్నారు. అనంతరం ప్రతిభ కనుపరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. చదువుకు అధిక ప్రాధాన్యత నిస్తామని..బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని.. జెసి రాజు విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొత్తవలస ఎస్ఐ మృతి

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న కె. వెంకటేశ్వర్లు (58) శనివారం అకాల మృతి చెందారు. ఆయన కొన్ని దినాల నుంచి బ్రెయిన్ క్యాన్సర్‌తో విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన 1990 సంవత్సరంలో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరి ఎస్ఐ స్థాయి వరకు ఎదిగారు. ఆయన ఉద్యోగంలో పట్టుదలతో, క్రమశిక్షణతో పనిచేసేవారని మంచి గుర్తింపు ఉంది. ఆయన భౌతికాయాన్ని కొత్తవలస సిఐ షణ్ముఖరావు, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

రామభద్రపురం: గడ్డి మందు తాగి తారాపురం గ్రామానికి చెందిన రేగు తౌడు (59) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన తౌడు వినాయక చవితి రోజున అధిక మోతాదులో మద్యం సేవించాడు. పని పాటా లేకుండా నిత్యం మద్యానికి బానిసైన తన జీవితం పట్ల విరక్తి కలగడంతో అదే సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతని కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూనియర్ అధ్యాపకులను రెగ్యులర్ చేయండి

ప్రజాశక్తి - జామి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు జూనియర్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఆదివారం తన ఇంటి వద్ద అధ్యాపకులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు అధ్యాపకుల బృందం విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో గత 25 ఏళ్లుగా సుమారు 3,620 మంది పని చేస్తున్నామన్నారు. వీరిని రెగ్యులరైజేషన్ చేయడం కోసం గత ప్రభుత్వం యాక్ట్ 30, జీవో నెంబర్ 114 విడుదల చేసిందని, సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ముందుకు వెళ్లకుండా ఆగిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి, రెగ్యులరైజేషన్ జీవో పునరుద్ధరణ చేసి కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కె. అప్పలనాయుడు, బి. అప్పారావు, జి. శ్రీను, డి. రామకృష్ణ, రామలక్ష్మి, అమ్మాజీ ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న అధ్యాపకులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - కొతవలస

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా నీటి వనరులు కులుషితమయ్యే అవకాశం ఉందని వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు గోపాల్ కృష్ణ, సీతల్ వర్మ సూచించారు. ఈ వర్షాలు కారణంగా ప్రజలు డయేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని, అందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి, వేడి ఆహార పదార్థాలు తినాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. మాంసం, చేపలు, గోంగూర, బిర్యానీ వంటి నిల్వ ఆహార పదార్థాలు తినరాదన్నారు. గోలేలు, కుండీలు, కడిగి ఆరబెట్టు కోవాలని, టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఇళ్ల ముందు ఉంచరాదని చెప్పారు. డెంగీ దోమలు మంచి నీటిలోనే పెరుగుతాయని, పగలే కుడతాయని తెలిపారు. మండలంలో రెండు పిహెచ్‌సిల్లో పాము, కుక్క కాటుకు వాక్సిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీ లు, సిబ్బంది సమన్వయంతో వాటర్ ట్యాంక్‌లు క్లోరి నేషన్ చేయించాలని సూచించారు.

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Roc.No.74/2023/E1. Dt.06-09-2024

S.No.	Nit No.	No. of works	Estimated cost
1	07/2024-25/DyEE/1-5, dt.06.09.2024	5	Rs. 37.19 Lakhs

Bid Document Downloading Start Date	: 09.09.2024 at 11.00 AM
Bid Document Downloading End Date	: 23.09.2024 at 11.00 AM
Last Date & Time for receipt of Bids	: 23.09.2024 at 03.00 PM
Technical Bid opening Date	: 23.09.2024 at 04.00 PM

Note: Other details please read e.procurement market plan https://tender apeprocurement.gov.in

Commissioner,
Bobbili Municipality

మహారాజశ్రీ బొబ్బిలి సినియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 7/2023 OS 18/2019

Between:-
దొడ్ల వెంకట కృష్ణ కుమార్ ......DHR/వాది
And:-
తెంటు భాస్కరరావు (died) ....JDR/ప్రతివాది
To
R2. తెంటు పద్మజ, W/o లేటు భాస్కరరావు, తెంటువలస గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా.
R3. తెంటు శ్రీనివాసరావు S/o లేటు భాస్కరరావు, -
Rest - ditto-

పై నెంబరు అమలులో 1వ JDR అయిన తెంటు భాస్కరరావు గారిపై కోర్టువారు తే 04-01-2021దీన జారీ చేసిన డిక్రీ ప్రకారం ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి అప్పగింత కోరుతూ DHR కి యి అమలు దాఖలు చేసి యున్నారు. దరిమిలా సదరు తెంటు భాస్కరరావు గారు కాలం చేసినందున సదరు భాస్కరరావు గారి Estateకు మీరే వారసులు అయి ఉన్నందున మరియు యిందలి అమలు షెడ్యూలు దాఖలా ఆస్తి మీ యొక్క ఆదీనములో ఉన్నందున యిందలి అమలు షెడ్యూలు దాఖలా Delivery నిమిత్తం పై అమలు <u>తే 14-10-2024దీకి పై కోర్టులో ఉ॥ 10-30 గం॥లకు</u> స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ యొక్క వాదనలు తెలియచేసు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మాణము చేయబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

SCHEUDLE :

District : Vizianagaram, Mandalam : Seethanagaram, Village : Latchayyapeta, S.No.58/2part, nature of land : Vacant site (Dry land)

Plot No.16: E to W; 2ft or 61 mts, N to S: 59 ft or 15.25 mtrs, Total: 11.11 sq ft or 9.28 sq mtrs.
Bounded by: East :Vacant site of plot No.7, South :Vacant site of plot No.1, west :vacant place of some part of plot No.16, North: 20ft width road cum drainage.

Plot No.17: E to W; 22ft or 6.71 mts, N to S: 67 ft or 20.435 mtrs, Total: 160 sq ft or 133.76 sq mts.

Plot No.18: E to W; 22ft or 6.71 mts, N to S: 59 ft or 17.994 mtrs, Total: 140 sq ft or 117.07sq mts,plot No.17 & 18 are situated as an on lot hence, common boundaries to the plot No.17 & 18.
Bounded by: East :Vacant land of Nalitham Keswararao, south: Gorja, west: vacant land of plot No.16& 1, North :20ft width road cum drainage.

Plot No.19. E to W; 22ft or 6.71 mts, N to S:50 ft or 15.25 mtrs, Total: 122.22 sq ft or 102.177 sq mts.

Plot No.20: E to W; 22ft or 6.71 mts, N to S:50 ft or 15.25 mtrs, Total: 122.22 sq ft or 102.177 sq mts.

Plot No.21: E to W; 22ft or 6.71 mts, N to S:50 ft or 15.25 mtrs, Total: 122.22 sq ft or 102.177 sq mts.

Plot No.22: E to W; 20ft or 6.10 mts, N to 5:50 ft or 15.25 mtrs, Total: 111.11 sq ft or 92.89 sq mts.

Total easements of the plot Nos.19,20,21 and is 477.77 sq yards and with contained common boundary:
East: Vacant site of Nalitham Keswararao, South: 20ft width road cum drainage, west:vacant place of Nalitham Keswararao, north: 20ft width road and drainage,

Plot No.23: E to W; 24ft or7.32 mts, N to S:40 ft or 12.20 mtrs, Total: 106.66 sq ft or 89.173 sq mts.

Plot No.24: E to W; 24ft or7.32 mts, N to S:40 ft or 12.20 mtrs, Total: 106.66 sq ft or 89.173 sq mts.

Total width of the plot Nos.23 and 24 is 213.22 sq yards and common boundary: East: Vacant site of Nalitham Keswararao, South: 20ft width road cum drainage, west vacant place of Nalitham Keswararao, north: vacant place of Nalitham Keswararao.

//కోర్టువారు ఆర్డరు ప్రకారం//

నాగుమళ్ళ జగదీశ్వరరావు
DHR తరపు న్యాయవ్యాది
పూల్‌బాగ్, బొబ్బిలి,
సెల్ : 9440980289

బొబ్బిలి
తేది : 8-9-2024